
వారం రోజుల్లో సీఎంఆర్ బకాయిలు చెల్లించాలి

❖ రైస్ మిల్లర్లకు తుది అవకాశం.. గడువు దాటితే చర్యలు: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



దశ, రంగారెడ్డి: జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిల వసూలుపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బకాయిదారులైన రైస్ మిల్లర్లతో సమావేశమై పెండింగ్ బకాయిల వివరాలను పరిశీలించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 201415 నుంచి 202425 వరకు ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 17 ప్రకారం బకాయిలను వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్ల వారీగా పెండింగ్ మొత్తాలను సమీక్షించి, చెల్లింపుల్లో జాప్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బకాయిల చెల్లింపునకు రైస్ మిల్లర్లకు తుది అవకాశం ఇస్తున్నట్లు చంద్రారెడ్డి తెలిపారు. సమావేశం జరిగిన తేదీ నుంచి వారం రోజుల్లోగా పెండింగ్ మొత్తాలను పూర్తిగా చెల్లించాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించని మిల్లర్లపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బకాయిల వసూలులో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

268 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజుల సాయం

❖ ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్‌రెడ్డి చొరవ



దశ, రంగారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ ముందడుగు వేసింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలు, వెల్జాల్‌లోని ఒకేషనల్ పాఠశాలలో చదువుతున్న మొత్తం 268 మంది పదో తరగతి విద్యార్థుల బోర్డు పరీక్ష ఫీజులను ఫౌండేషన్ తరపున చైర్మన్ ఎర్ర సుధాకర్‌రెడ్డి అందజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ప్రోత్సహించి, విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులో ఉండేలా చేయాలనే ప్రేరణతో ఫౌండేషన్ పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి, పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావడంతోపాటు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ బండి రఘుపతి, సభ్యులు వసపుల రమేష్, మూడవత్ శివ, నితిన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే నిలయం వద్ద పోలీసులతో తోపులాట

❖ ధర్నాలో కిందపడిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్



దశ, ఓయూ: రైల్వే నిలయం వద్ద నిర్వహించిన మెరుపు ధర్నా సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు కిందపడిపోయారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సురేష్‌లాల్ నేతికర్ పాల్గొన్నారు .

ఫుట్‌పాత్‌లపై వాహనాల పరుగులు..

❖ చౌటుప్పల్‌లో ప్రమాదకర ప్రయాణాలు!
❖ రోడ్డు విస్తరణ పనులతో ట్రాఫిక్ ఇబ్బందులు.. పాదచారుల భద్రతకు ముప్పు







దశ, చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు వాహనదారులతోపాటు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రధాన రహదారిపై పనులు జరుగుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో కొందరు వాహనదారులు ట్రాఫిక్ నుంచి తప్పించుకునేందుకు ఫుట్‌పాత్‌లపై నుంచి ప్రయాణిస్తున్నారు. పాదచారులు నడవాల్సిన మార్గాల్లోకి వాహనాలు రావడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి.

రోడ్డు విస్తరణ పనుల కారణంగా ప్రధాన రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదులుతుండటం, రద్దీ పెరుగుతుండటంతో కొందరు ద్విచక్ర వాహనదారులు ఫుట్‌పాత్‌లను ప్రత్యామ్నాయ మార్గాలుగా ఉపయోగిస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌లపై నడిచే పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనాలు, పాదచారులు ఒకే మార్గంలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు సురక్షితంగా నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై వాహనాలు ప్రయాణించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు పనుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాల్సి ఉండగా, ఫుట్‌పాత్‌లపైకివెళ్లడంవల్లపాదచారులప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

చిన్నపిల్లలు, వృద్ధులు రహదారిపైకి వెళ్లలేక ఫుట్‌పాత్‌లను ఆశ్రయించే సమయంలో వాహనాలు ఎదురవుతుండటంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలనిస్థానికులుకోరుతున్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవడంతోపాటు, పాదచారులు సురక్షితంగా నడిచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం పనులు జరుగుతున్న సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడంతోపాటు, ఫుట్‌పాత్‌లపై వాహనాల రాకపోకలను అరికట్టాలని చౌటుప్పల్ ప్రజలు కోరుతున్నారు.

దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరం



దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంవెల్లంకి గ్రామ ప్రభుత్వ పాఠశాలలకు దివిస్ లేబరేటరీ అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట మండలం వెల్లంకి గ్రామ సర్పంచ్ ఈడం రాధ శ్రీనివాస్ ,సూచించారు,వెల్లంకి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివిస్ లేబరేటరీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు దివిస్ సమకూర్చిన రూ 2, 27, 766 విలువగల నోటు పుస్తకాలు, టానికులు, ఔషధాలను సర్పంచి చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి వార్డు సభ్యులు లింగయ్య, గ్రామ పెద్ద ఇడం శ్రీనివాసులు, వైద్యాధికారి నరేష్, దివిస్ ప్రతినిధులు బి. గోపి, జి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కి త్రుటిలో తప్పిన ప్రమాదం

దశ,రామన్నపేట: యాదాద్రిభువనగిరిజిల్లారామన్నపేట మండలం బోగారం గ్రామ శివారులో ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఆర్టిసి బస్సు కి ప్రమాదం త్రుటిలో తప్పింది, వివరాల్లోకి వెళితే భువనగిరి చిట్యాల రహదారిపై గేదెల రోడ్డుతో వెళ్తున్న వాహనం గేదె పేడను రహదారిపై వేయడంతో అదే రహదారిన వస్తున్నటువంటి ఆర్టీసీ బస్సు పేడను తొక్కి అదుపుతప్పి రోడ్డు పక్కన కి దూసుకెళ్లింది వెంటనే గమనించిన డ్రైవర్ ప్రయాణికులని బస్సు నుండి సురక్షితంగా బయటికి పంపించాడు అనంతరం రామన్నపేట ఎస్సై గోపాతి సతీష్ సంఘటన స్థలానికి పంపించి బస్సును ప్రమాదకరం నుండి బయటకు తీసి పంపీయడం జరిగింది, ఈ సందర్భంగా పలువురు రోడ్లపై ప్రయాణం చేస్తున్న సమయంలో ఇలాంటి వ్యర్థాలు కానీ ప్రమాదం జరిగే అటువంటి వస్తువులు ఏమైనా సరే రహదారి పైన వేయవద్దు అని పలువురు కోరారు



రంగారెడ్డి జిల్లా టీజీవో సంఘం కోశాధికారిగా రేవతి దేదీప్యా ఏకగ్రీవ ఎన్నిక

❖ కొత్త కార్యవర్గం ఏర్పాటు.. ఉద్యోగుల సంక్షేమానికి సమష్టి కృషి



దశ, రంగారెడ్డి: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రంగారెడ్డి జిల్లా కోశాధికారిగా శ్రీమతి రేవతి దేదీప్యా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి నేతృత్వంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంఘం సభ్యత్వనమోదు ప్రక్రియను వేగవంతం చేసి, సభ్యత్వ రుసుము రసీదులను వెంటనే సంఘానికి సమర్పించాలని నిర్ణయించారు. జిల్లా గెజిటెడ్ అధికారుల హౌసింగ్ సొసైటీలో మరింత మంది అధికారులను సభ్యులుగా చేర్పించేందుకు దరఖాస్తులు స్వీకరించాలని తీర్మానించారు. 2027 డైరీ, క్యాలెండర్ కోసం ప్రకటనల సేకరణను త్వరగా పూర్తి చేయాలని, వచ్చే నెలలో జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

రిటైర్మెంట్, ఇతర జిల్లాలకు బదిలీల కారణంగా ఖాళీ అయిన కార్యవర్గ స్థానాల్లో కొత్త సభ్యులను ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్లుగా రాకేష్, సైదమ్మ, ఎం. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా మహేశ్వర్, ఎన్. సూర్య, కల్చరల్ సెక్రటరీగా వి. జ్యోత్స్న, ఆఫీస్ సెక్రటరీగా విక్టోరియా రాణి, కార్యవర్గ సభ్యురాలిగా డాక్టర్ దీప్తి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ నూతనకంటి వెంకట్, వైస్ ప్రెసిడెంట్ నర్సిరెడ్డి, జాయింట్ సెక్రటరీ శాంతిశ్రీతోపాటు పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, వారి న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా, సమష్టిగా పనిచేస్తామని సంఘం నాయకులు తెలిపారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఉపాధి పనులు పెంచాలి

❖ వలసలు నివారించాలి.. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి: మంత్రి సీతక్క

దశ, రంగారెడ్డి: ఎల్‌నినోప్రభావంతోవర్షాలు తగ్గి పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులను విస్తృతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. బుధవారం సెర్ప్ సీఈవో డి. దివ్య దేవరాజన్, ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్‌తో కలిసి అదనపు కలెక్టర్లు, పీడీ డీఆర్‌డీఏలు, సర్పంచులు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

గ్రామీణ కూలీలు, రైతులకు వి.బి.జి. రాంజీ పథకం కింద ఉపాధి కల్పించి, వలసలను నివారించాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో కొత్త పనులను గుర్తించి, వాటి ద్వారా పనిదినాలను పెంచాలని తెలిపారు. ఈ పథకం కింద 375 రకాల పనులు ఉన్నాయని, వాటిపై సర్పంచులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. చేపట్టిన పనులకు పది రోజుల్లోనే కూలి డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని, చెల్లింపులపై ఆందోళన చెందకుండా పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

గ్రామసభలు నిర్వహించి పనులను గుర్తించడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, సకాలంలో పూర్తి చేయడంపై దృష్టి

పెట్టాలన్నారు.పాఠశాలలు,గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాల భవనాలు, గోదాములు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. పశువుల తాగునీటి కోసం నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు లేదా గ్రామ సంఘాల ద్వారా పశుగ్రాసం సాగు చేస్తే ఎకరానికి రూ.14 వేల ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. పశుగ్రాసాన్ని విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన గ్రామానికి కేంద్ర ప్రభుత్వం నుంచి కోటి రూపాయలు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాల భవనాలు, అదనపు గదులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉపాధి పనులను పెంచేందుకు ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి గ్రామపంచాయతీతోపాటు ఆవాస ప్రాంతాల్లోనూ పనులు కల్పిస్తామని చెప్పారు. పశుగ్రాసం సాగు, వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పీడీ డీఆర్‌డీఏ శ్రీలత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ రాజేశ్వర్‌రావు, డీపీఓ సురేశ్ మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కి పరిగి చేజారుతోందా.?

- భూసేకరణపై పెద్దెత్తున ఉద్యమాలు
- నిరాశ పరిచిన ఆర్టీసీ ఫలితాలు
- బల్దియా ఎన్నికల్లోనూ అత్తెసరు మెజార్టీ
- దూరమవుతున్న బీసీ నాయకులు
- టీఆర్ఆర్ తీరుపై పార్టీలో అసంతృప్తి







దశ,తాండూర్ ప్రతినిధి: వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోందన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల కాలంలో జిల్లాలో ఎక్కడాలేని విధంగా పరిగి నియోజకవర్గంలో ప్రజా నిరసనలు అధికమయ్యాయి. పరిగిలో ప్రతిపాదించిన పారిశ్రామిక వాడలకు భూసేకరణ ప్రజా ఉద్యమాలకు వేదికగా మారింది.తాజాగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో పరిగి డిపోలో అధికార పార్టీ మద్దతు ఇచ్చిన సంఘం ఓడిపోవడం విశేషం. ఈ ఏడాది మొదట్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కూడా కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో సత్తాచాటలేక పోయింది. పార్టీలోని బీసీ నేతలకు ప్రాధాన్యం దక్కడం లేదన్న ప్రచారం కూడా జరుగుతోంది. మొత్తంగా పరిగి చేజారుతోందా అనే ఆందోళన అధికార పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది.

పరిగి వికారాబాద్, పరిగిషాద్నగర్ మధ్య నాలుగు వరుసల రహదారి కొరకు రూ.240 కోట్లతో పనులు, పరిగిలో రూ.26 కోట్లతో 100 పడగల ఆసుపత్రి నిర్మాణం, పూడూరు మండలం దామగుండంలో రూ.1500కోట్లతో రాడార్ స్టేషన్ నిర్మాణం, రూ.200 కోట్లతో తుంకుల గడ్డలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం, రూ.16 కోట్లతో తాగునీటి పథకాలు,కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం భూసేకరణకు రూ.587 కోట్లు, పరిగి మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), మన్నెగూడ నుంచి పరిగి, పరిగి నుంచి కొడంగల్ వరకు ఎన్హెచ్ 163 విస్తరణ పనులకు ఆమోదం. పరిగి మీదుగా క్రిష్ణ స్టేషన్ వరకు కొత్త రైల్వేట్రాక్ నిర్మాణం లాంటి కార్యక్రమాలను నిత్యం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్రెడ్డి చెబుతుం టారు. అయితే, పరిగి ప్రాంతంను అభివృద్ధి చేస్తున్నా ప్రజల నుంచి ఆస్థాయిలో మద్దతు లభించడం లేదన్న చర్చ జరుగుతోంది.

ఎమ్మెల్యే తీరుతో బేజారు

పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నట్లు చెబుతున్నా.ప్రజాపాలన కంటే పోలీసు పాలన జరుగుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్రెడ్డి చెప్పిన మాట వినని వారిని అణిచివేసేందుకు పోలీసులను ఎక్కువగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయనకు థర్డ్ డిగ్రీ ఎమ్మెల్యే అనే కొత్త పేరును కూడా పెట్టినట్లు చర్చ జరుగుతుంది. పరిగి అసెంబ్లీ నియోజకవర్గం పరిగి, దోమ మండలాల్లో ప్రతిపాదించిన పారిశ్రామిక వాడలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపైకి పోలీసులను వినియోగించడం వివాదంగా మారింది. నిరసనకు వేసిన టెంట్లను తొలగించాలని ఆదేశించడం.. స్థానిక నేతలను బెదిరిస్తూ మాట్లాడిన ఆడియోలు బయటకు రావడంతో ఎమ్మెల్యే రామ్మోహన్రెడ్డి ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్నారు. పారిశ్రామికవాడలకు రైతులు భూములు ఇవ్వకపోయినా ఇచ్చేందుకు అంగీకరించాలని అసెంబ్లీలో మాట్లాడడంపై కూడా ఆయా గ్రామ రైతులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పరిగిలో నిర్మిస్తున్న పారిశ్రామిక పార్కులు, ట్రిపుల్ ఆర్ రోడ్డు, రేడియల్ రోడ్డులకు పెద్దఎత్తున భూసేకరణ చేస్తుండడం ఎమ్మెల్యేకు వ్యతిరేకతను తీసుకవస్తోంది.

గుర్రుగా బీసీ నేతలు, ప్రజలు

వారం రోజుల క్రితం పరిగి ఆర్టీసీ డిపోలో గుర్తింపు కార్మిక సంఘంకు జరిగిన ఎన్నికలలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. అధికార కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ గెలుపు కొరకు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్రెడ్డి ప్రచారం చేశారు. డిపోలో మొత్తం 269 ఓట్లు ఉంటే 266 ఓట్లు పోలయ్యాయి. రీజియన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కు 128 ఓట్లు రాగా టీజేఎంయూకు 114 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన కు కేవలం 24ఓట్లు రావడం గమనార్హం. టీజేఎంయూ రాష్ట్రనేతగా ఉన్న హన్మంతు పరిగి డిపోకు,పరిగి ప్రాంతానికి చెందిన వారు కావడం విశేషం. ఆయన కాంగ్రెస్ కు,స్థానిక ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడు. ఎమ్మెల్యే పాదయాత్రలో కూడా హన్మంతు వెంటనే ఉన్నారు. డిపోలో హన్మంతు తన పట్టును నిలుపుకున్నారు. ఇదే తరహా పరిస్థితిని కాంగ్రెస్ లోని బీసీ నేతలు ఎదుర్కొంటున్నారు. తమకు నామినేటెడ్ పదవులు దక్కడం లేదనే ఆందోళన కాంగ్రెస్లోని బీసీ నేతలలో కనిపిస్తోంది. ముఖ్యంగా లాల్ క్రిష్ణప్రసాద్ లాంటి వ్యక్తులు పదవుల కొరకు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. బీసీ నేతల విషయంలో పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్రెడ్డి అనుసరిస్తున్న విధానంతో బీసీ నేతలతోపాటు బీసీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. పరిగి నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. ఈఏడాది మొదట్లో జరిగిన మునిసిపల్ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీని సాధించకలేకపోయింది. హైడ్రామా మధ్య స్వతంత్రులతో కలిసి చైర్మన్ పీఠంను దక్కించుకోవాల్సి వచ్చింది.

బీజేపీ నూతన పదాధికారులకు సన్మానం



దశ, ఓయూ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి నూతనంగా నియమితులైన బీజేపీ నాయకులను ఘనంగా సన్మానించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సతీష్ రెడ్డి, తార్నాక డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన కేదారిని ఆమె అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎన్. మల్లికంటి వీరన్న, కిరణ్ గౌడ్, టెంపుల్ సాయి, చింటూ, రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి



దశ, ఓయూ: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాయినంపల్లి గ్రామానికి చెందిన ముక్కుల శ్రీనివాస్ చారి ఆకస్మిక మృతి బాధాకరమని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, వికలాంగుడైన కుమారుడు భానుతో పాటు తల్లి రాజమ్మకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ శ్రీనివాస్ చారి కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభోజు నరసింహ చారి, అనంతోజు బ్రహ్మచారి, బాలకృష్ణ చారి, పెద్ద బ్రహ్మచారి తదితరులు పాల్గొని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

కల్వకుంట్ల వంశీధర్ రావును కలిసిన బిఆర్ఎస్ నేతలు



దశ, ఓయూ: సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ కు చెందిన పలువురు బి ఆర్ ఎస్ నాయకులు బిఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్చార్జ్ కల్వకుంట్ల వంశీధర్రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సిద్దిపేటలో వంశీధర్రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు వెళ్లి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీధర్రావును పూలమాలతో, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింత లక్ష్మణ్, పరుశరాములు, వరికుప్పల శ్యామ్, మనోహర్ తదితరులున్నారు.

బాలల హక్కులపై అవగాహన సదస్సు

దశ, తాండూర్ ప్రతినిధి: తాండూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నెంబర్ 1 పాఠశాలలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తాండూర్ జూనియర్ సివిల్ జడ్జ్ గిరిజ తిరందాసు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా తిరందాసు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు ఆపదలో ఉన్నప్పుడు 1098 కు కాల్ చేసి సహాయం పొందవచ్చు అని అన్నారు. ఫోక్సో చట్టం విద్య హక్కు చట్టం బాల్యవివాహాల నిర్మూలన మరియు బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తాండూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి పాశం రవికుమార్ ప్యానల్ న్యాయవాదులు జిలాని టీ. అరుణ ఏ. పరమేశ్వరి మస్తాన్ దేవ్ రాజ్ మరియు న్యాయవాదులు కోర్టు సిబ్బంది హెడ్మాస్టర్లు గోపాల్ సార్ అబ్దుల్ రెహమాన్ సార్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





మానవ కర్మల నివారణకు రుద్ర సహిత కాలభైరవ మహా యజ్ఞం

డిసెంబర్ 1వ తేదీన 1,116 మంది దంపతులతో నిర్వహణ

దశ, సూర్యాపేట ప్రతినిధి : భక్తజనులు, పేదలకు యజ్ఞయాగాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో శ్రీ బాల మానస మహా విద్యాపీఠం ఆధ్వర్యంలో డిసెంబర్ 1న సూర్యాపేటలో శ్రీ రుద్ర సహిత కాలభైరవ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ సద్గురు భవాని స్వామి తెలిపారు. బుధవారం సూర్యాపేటలోని యార్రంశెట్టి ఉపేందర్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన యజ్ఞం వివరాలను వెల్లడించారు. యజ్ఞయాగాల నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో పేదలు సైతం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేలా రూ.1,516 చెల్లించి హోమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజ శ్రేయస్సు, మానవ కర్మల నివారణ లక్ష్యంగా గురువుల ఆశీస్సులతో గతంలో ఎనిమిది మహా యజ్ఞాలు నిర్వహించామని, ప్రస్తుతం తొమ్మిదోసారి 1,116 మంది దంపతులతో ఈ మహా యజ్ఞం చేపడుతున్నామని వివరించారు. నవంబర్ 30న గణపతి పూజ, మండప స్థాపన, కలశ స్థాపన, సహస్ర మోదక గణపతి హోమం, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

డిసెంబర్ 1న కాలభైరవ స్వామి ఆవాహనం, విశేష పూజలు, కాలభైరవ హోమం, మహా పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి. సూర్యాపేటలోని తిరుమల నగర్, రోడ్ నంబర్ 24, 100 ఫీట్ల కలెక్టరేట్ రోడ్డులో అమ్మ గార్డెన్ ఎదురుగా ఈ యజ్ఞం నిర్వహించనున్నట్లు స్వామీజీ తెలిపారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహా యజ్ఞాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ షేక్ జహీర్, సలిగంటి వీరేందర్, యార్రంశెట్టి ఉపేందర్, సంకురిశెట్టి పరమేష్, ఇతర నాయకులు, ట్రస్టు సభ్యులు జెట్టి రవికుమార్, రాజిరెడ్డి, శ్రావణ్ కుమార్, క్రాంతికుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో పెన్‌డౌన్–టూల్‌డౌన్ విజయవంతం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.. నాన్ టీచింగ్ జేఏసీ డిమాండ్



దశ ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పెన్‌డౌన్-టూల్‌డౌన్ నిరసన కార్యక్రమం విజయవంతమైంది. విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలిపారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్లపై అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని జేఏసీ నాయకులు కోరారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ..

ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం పాత, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, యాజమాన్య వాటాపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. టైమ్‌స్కేల్ ఉద్యోగులకు రావాల్సిన 60 శాతం బకాయిలను చెల్లించాలని, 2023 నుంచి నిలిచిపోయిన రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల రిటైర్మెంట్ ప్రయోజనాలను పునరుద్ధరించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఏప్రిల్ 2023 నుంచి నిలిచిపోయిన నెలకు రూ.1,500 వార్షిక ఇంక్రిమెంట్‌ను బకాయిలతో సహా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

సుమారు 25 ఏళ్లుగా విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అనుకూలంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని జేఏసీ కోరింది. కోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను అక్టోబరు 30లోపు సమర్పించాల్సి ఉన్నందున, అనుబంధ పత్రాల్లో కోరిన సమాచారాన్ని వెంటనే ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కుమార్, అధ్యక్షుడు ఖదీర్ ఖాన్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, అరు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. నిరసనకు సహకరించిన ఉద్యోగులకు జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని, గురువారం (అక్టోబరు 29)కూడా పెన్‌డౌన్-టూల్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

స్టాన్‌ఫోర్డ్‌లో పరిశోధనకు అనన్య శర్మకు అవకాశం

- ఉస్మానియా వర్సిటీలో ముగిసిన ఫాస్మి అంతర్జాతీయ సదస్సు



దశ ఓయూ: మాలిక్యులర్ ఇమేజింగ్ రంగంలో అంతర్జాతీయ పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఫాస్మి ద్వైవార్షిక అంతర్జాతీయ సదస్సు-2026 బుధవారం ముగిసింది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిర్వహించిన ఈ సదస్సును ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ సొసైటీస్ ఫర్ మాలిక్యులర్ ఇమేజింగ్ (ఫాస్మి), మాలిక్యులర్ ఇమేజింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా (మిసీ) సంయుక్తంగా నిర్వహించాయి. తొలిసారిగా భారత్‌లో జరిగిన ఈ సదస్సులో పలువురు అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

స్టాన్‌ఫోర్డ్‌లో మూడు నెలల పరిశోధన: సదస్సులో ప్రతిభ కనబరిచిన పరిశోధకురాలు డా. అనన్య శర్మకు శామ్ గాంబీర్ స్మారక పురస్కారం లభించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)కు చెందిన ఆమె.. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో డా. రామసామి పాల్‌మురుగన్ మార్గదర్శకత్వంలో మూడు నెలలపాటు పరిశోధనలు చేసే అవకాశం పొందారు. ఇందుకు పూర్తి ఆర్థిక సహాయం అందించనున్నారు. విద్యార్థుల పరిశోధనలను పరిశీలించిన అనంతరం డా. పాల్‌మురుగన్ ఈ పురస్కారానికి ఆమెను ఎంపిక చేశారు.

సదస్సు ముగింపు కార్యక్రమానికి డా. రామసామి పాల్‌మురుగన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ ఎ. కృష్ణయ్య గౌరవ అతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి. సుమన్ తదితరులు పాల్గొన్నారు. వైద్య చిత్రీకరణలో కృత్రిమ మేధ వినియోగం, ఆధునిక చిత్రీకరణ విధానాలు, పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య పరిశోధన సహకారం, పరిశోధనలకు నిధుల సమీకరణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు చర్చించారు. హోమీ భాభా జాతీయ సంస్థ ప్రొఫెసర్, ACTRECలోని మాలిక్యులర్ ఫంక్షనల్ ఇమేజింగ్ ప్రయోగశాల అధిపతి డా. అభిజిత్ డే ముగింపు కీలకోపన్యాసం చేశారు.